APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 13 సెప్టెంబరు 2026 సంపుటి: 01 సంచిక :109 పేజీలు : 04 వెల: 2-00/-

## డీఎస్సీపై ఫేక్ ప్రచారం - పెద్ద అప్పలరాజు ఉద్యోగంపై లోకేశ్ క్లారిటీ



డీఎస్సీ నియామకాల్లో ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని లోకేశ్ తెలిపారు.

నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన బాక్సర్ పెద్ద అప్పలరాజుకు డీఎస్సీలో టీచర్ ఉద్యోగం

లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

ఢిల్లీ : మెగా డీఎస్సీ-2025 నియామకంపై వైఎస్సార్సీపీ బురద జల్లుతూనే ఉంది. అయితే ఈ రిక్రూట్‌మెంట్ లో అవకతవకలు జరిగాయని అర్హత లేనివారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపణలు గుప్పిస్తోంది. దీనిపై ఇటు అధికారులు, అటు సర్కార్ కౌంటర్ ఇస్తూనే ఉంది. ఈ క్రమంలోనే డీఎస్సీ నియామకాల్లో కూటమి ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కానీ వైఎస్సార్సీపీ మాత్రం ఫేక్ ప్రచారంతో క్రీడాకారులను అవమానిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్ పెద్ద అప్పలరాజుకు మిగతా..2లో

## తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన



తెలంగాణలో మరో వారం పాటు వర్షాలు కొనసాగింపు

రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన

ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా

సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ

హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్: తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. మిగతా..2లో

## దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం




- బీసీ రక్షణ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న సవిత
- బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యమని వ్యాఖ్య
- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని విమర్శ

అమరావతి : బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన '

## ఏపీలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను

# అప్రమత్తం చేయండి..

### అధికారులకు పవన్ దిశానిర్దేశం

- ★ రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.
- ★ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు.



## సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

- సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమావేశం
- ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన భేటీ
- మర్యాదపూర్వకంగానే సమావేశమైన ఇరువురు నేతలు
- పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏపీకి వచ్చిన నడ్డా



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా..2లో

## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి

# వ్యతిరేకం కాదు

- ఢిల్లీలో ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- అతిథులు అందరికీ స్వాగతం పలికిన ప్రధాని మోదీ




ఢిలి: బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. సందర్భంగా మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదని ప్రధాని ఉద్ఘాటించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుపరచడానికి 10 సూత్రాలతో కూడిన ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోదీ ప్రతిపాదించారు. "మీ అందరికీ స్వాగతం పలకడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రధాన్యతలు. వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఈ దార్శనికతను దృష్టిలో ఉంచుకొని, 350కిపైగా సమావేశాలు నిర్వహించాం. మిగతా..2లో

## రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ




- నేర పరిశోధనకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు వెన్నెముక లాంటివన్న డీజీపీ హరీశ్ గుప్తా
- పలు కేంద్రాల్లో ల్యాబ్‌లను ఆధునీకరిస్తున్నామని వెల్లడి
- కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే నివేదికలు అందిస్తున్నామన్న డీజీపీ

## ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

- బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- విభేదాలు పక్కనపెట్టి ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు



ఢిల్లీ : సభ్యదేశాల ఆమోదంతో బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను శనివారం ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. భారత్ దైత్యం ఫలితంగా, విభేదాలు పక్కనపెట్టి ఢిల్లీ డిక్లరేషన్‌కు అరబ్ దేశాలైన ఇరాన్ , యూఏఈ, సౌదీ అరేబియా ఆమోదం తెలిపడం విశేషం. ఈ ప్రకటనకు ముందు జరిగిన చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. ఎందుకంటే ప్రారంభంలో ఇరాన్ , యూఏఈలు కఠిన వైఖరి అవలంభించాయి. బ్రిక్స్ అనేది పూర్తిగా ఏకాభిప్రాయంతో నడిచే కూటమి, కనుక ఏ ఒక్క సభ్యదేశం వ్యతిరేకించినా సరే ఉమ్మడి ప్రకటన నిలిచిపోతుంది. ఇలాంటి తరుణంలో భారత్ అద్భుతమైన దౌత్య విజయం సాధించింది. శనివారం జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో సభ్యదేశాలన్నీ ఏకాభిప్రాయంతో ఒక జాయింట్ డిక్లరేషన్ ను ఆమోదించాయి. పశ్చిమాసియా సంక్షోభం విషయంలో ఇరాన్ , యూఏఈ, సౌదీ అరేబియా మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, తెరవెనుక జరిగిన వరుస చర్చల ఫలితంగా ఈ ప్రతిష్టంభనకు తెరపడింది. దీనితో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మిగతా..2లో

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి




- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర

## అన్ని సౌకర్యాలు అందిస్తాం,

# భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు.
- ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.




హైదరాబాద్: గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్ లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్ కు అందించాలని సూచించారు. మిగతా..2లో

## నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

- ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని గత పాలకులు వేలాది ఎకరాలు చెరబట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.
- 22ఏపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు.



హైదరాబాద్: నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదని, గతంలో ఉన్నదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములను బలమున్నవాడు కొల్లగొట్టకుండా తెచ్చిన చట్టమని వివరించారు. 22ఏ నిషేధిత జాబితా భూముల అంశంపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా మాట్లాడారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## డీఎస్సీపై ఫేక్ ప్రచారం - పెద్ద అప్పలరాజు ఉద్యోగంపై లోకేశ్ క్లారిటీ

డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని లోకేశ్ మండిపడ్డారు. ఆయన సెమీఫైనల్ పోరాటానికి సంబంధించిన వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించే ప్రచారాన్ని జగన్ ఇప్పటికైనా ఆపాలని హితవు పలికారు. అసలు వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసేలా పెద్ద అప్పలరాజుపై ఫేక్ ప్రచారం అసలు వాస్తవం పేరుతో లోకేశ్ ఎక్స్ వేదికగా వీడియోను రిలీజ్ చేశారు. విమర్శించే స్థాయి కొడాలి నానికి లేదని మంత్రి వాసంశెట్టి సుభాశ్ విమర్శించారు. 7వ తరగతి కూడా పాస్ కాని నానికి విద్యారంగం, డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వచ్చే దమ్ము వైఎస్సార్సీపీ నేతలకు లేదని ఆక్షేపించారు. 11 సీట్లకు ఘోరంగా పడిపోయినా జగన్ కు ఇంకా బుద్ధి రాలేదని, కొడాలి నాని లాంటి నేతల వల్లే ఆ పార్టీ ఘోర పరాజయం పాలైందని పేర్కొన్నారు.

## దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

## అన్ని సౌకర్యాలు అందిస్తాం, భక్తితో గణనాథుడిని పూజిద్దాం

ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

### మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి

విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన

ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

### ఆరోగ్య శాఖ హెచ్చరిక

వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ



హైదరాబాద్ :రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

## ఏపీలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయండి..

మొదటి పేజి తరువాయి

అమరావతి, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు. ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని మార్గనిర్దేశం చేశారు. వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అప్రమత్తం చేశారు. గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో



ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అలర్ట్ చేశారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

మొదటి పేజి తరువాయి

**ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.**

### ఆ భూములను పొరపాటున 22ఏలో చేర్చారు

నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. "దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ, భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిలేకుండానే ఆ పాసుపుస్తకాలకు కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారు. భూమిలేని వారికీ రైతుబంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే మాక్ అసెంబ్లీ ఎందుకు? అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకుని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు"- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి

### కోట్ల మంది వివరాలు విదేశీ సంస్థలో చేతిలో పెట్టారు

కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు



చేస్తామని స్పష్టం చేశారు.

### ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని వేలాది ఎకరాలు చెరబట్టారు

ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

## దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

మొదటి పేజి తరువాయి

ఈ జాయింట్ డిక్లరేషన్ ఆమోదం పొందినట్లు తాజాగా అధికారికంగా ప్రకటించారు.

### పాత వ్యవస్థలు ఇక పనికిరావు!

ఈ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో కరచాలనం చేస్తూ కనిపించారు. సదస్సు ముగింపు ఉపన్యాసంలో మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మారుతున్న ప్రపంచాన్ని పాతపడిపోయిన వ్యవస్థలు నడపలేవు. నేటి చర్చల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పనలో కచ్చితంగా సంస్కరణలు అవసరం. అలాగే భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో, వాటి నియంత్రించే నిబంధన రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని మేము నొక్కి చెప్పాము. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని- భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణ ద్వారా మాత్రమే పూడ్చగలం. ఈ రోజు ఆమోదించిన దిల్లీ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చవలసిన



బాధ్యత ఇప్పుడు మనందరిపైనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు

ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్ , ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.

డాలర్ కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

సుమారు 30 నగరాల్లో మీ బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది. బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇందులోని సభ్యదేశాల ప్రజలకు మనం భరోసా కల్పించాలి. పరస్పర సహకారంతో బ్రిక్స్ దేశాలు మరి అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా అంతర్జాతీయ సమస్యలకు మనం పరిష్కారం చూపించాల్సి ఉంది. మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కాలం కావాలి. అంతేకాదు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కూడా సంస్కరణలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలను పరిష్కారం చూపించాలి. ఇందుకోసం మనం ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. అలాగే ఏఐ, సైబర్ స్పేస్ , బయోటెక్నాలజీ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలి. అంతేకాదు గ్లోబల్ సౌత్ దేశాలకు దిశానిర్దేశం చేయాలి' అని మోదీ అన్నారు.

బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు!

"మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇదొక చారిత్రాత్మక మైలురాయి. మానవ జీవితంలో 20ఏళ్ల వయస్సు అనేది పరిణితి, బాధ్యతతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. ఇది బాధ్యతలు, ఆకాంక్షలతో ముడిపడే, సామర్థ్యాలను కొత్త దిశను కనుగొనే దశ. నేడు బ్రిక్స్ కూడా సరిగ్గా ఇలాంటి పరిణితి చెందిన దశలోనే ఉంది. మనం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మన విధానం ఎవరికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలుపుకుపోవడమే మన లక్ష్యం. ఇప్పుడు బ్రిక్స్ దేశాల ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైంది."

- ప్రధాని నరేంద్ర మోదీ

సంస్కరణలు చేపట్టాల్సిందే! రానున్న 20 ఏళ్ల కోసం ఒక సరికొత్త, ప్రతిష్ఠాత్మకమైన ఎజెండాను రూపొందించాలని ప్రధాని మోదీ బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. "బ్రిక్స్ అధ్యక్ష పదవి ఏటా మారుతున్నప్పటికీ, అది మన సంస్థాగత వేగానికి ఆటంకం కలగకూడదు. ఇందుకోసం మన ఒక ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థను (ట్రోయ్కా-ౠతీశీఱఝ ఖతీతీఖఅవ్రవఎవత్) ఏర్పాటు చేయాలి. దీని వల్ల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కలుగుతుంది. అలాగే ప్రతి నిర్ణయానికి సంబంధించిన నోడల్ పాయింట్ , కాలపరిమితి, పని ఎంత వరకు వచ్చిందో రికార్డు చేయడానికి ఒక సురక్షితమైన రిపోజిటరీ (డిజిటల్ స్టోరేజ్ )ని ఏర్పాటు చేయాలి" అని మోదీ అన్నారు.

### బ్రిక్స్ మరింత బలోపేతం

"బ్రిక్స్ ను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రపంచ సంస్కరణల కోసం మనం ఒక మార్గాన్ని కూడా సుగమం చేయాలి. ప్రస్తుత ప్రపంచ పాలనా విధానం (గ్లోబల్ గవర్నెన్స్ ) నిర్మాణం ఒక పిరమిడ్ లా ఉంది. అధికారం, నిర్ణయాధికారాలు కేవలం పైనున్న కొన్ని దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కింది శ్రేణిలో ఉన్న




దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమవుతున్నప్పటికీ, వాటిని మార్చగల శక్తి వాటికి లేదు. అందుకే ఈ పద్ధతి మారాలి. ఇందుకోసం సంస్కరణలు చేపట్టాలని" మోదీ పేర్కొన్నారు.

ఉమ్మడి ప్రకటన

కాగా, ఈ రోజు బ్రిక్స్ దేశాలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రకటన చేయనున్నాయి. శనివారం జరిగిన సుదీర్ఘమైన చర్చల తర్వాత బ్రిక్స్ దేశాలు ఓ ఏకాభిప్రాయానికి వచ్చాయి. పలు వివాదాస్పద అంశాలపై భేదాభిప్రాయాలు వ్యక్తమయినప్పటికీ, భారత్ నిరంతర చర్చలు, సంప్రదింపుల ద్వారా సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఇరాన్ , సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ప్రాంతీయ, భౌగోళిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, వారంతా ఒకే వేదికపైకి వచ్చి ఈ ఉమ్మడి ప్రకటనకు అంగీకరించేలా చేయడంలో భారత్ విజయం సాధించింది.

## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి'- మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ కీలక సూచనలు

గ్లోబల్ సౌత్‌లో భారత్‌పై నమ్మకం పెంచాలన్న కాంగ్రెస్ ఇరాన్ విషయంలో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలన్న హస్తం పార్టీ

సమ్మిట్ వివరాలపై మోదీ ప్రెస్‌మీట్ పెట్టాలని డిమాండ్

: బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు.

ఇరాన్ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందే!

ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

బ్లాక్ రాజకీయాలకు దూరంగా!

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు,

## పండుగ ఎంత ముఖ్యమో..
# పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం

అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : మన సాంప్రదాయాల ప్రకారం పండుగలు ఎంత ముఖ్యమో.. జన జీవనానికి పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆమె పాపంపేటలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. టీడీపీ నేత మిడుతూరు హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాపంపేట వాసులకు వెయ్యి వినాయక విగ్రహాలను అందజేస్తూ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణం బాగుండాలన్న మంచి ఉద్దేశ్యంతో మిడుతూరు హరీష్ పాపంపేటలో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మీ పరిసర



ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పూజించేలా అవగాహన కల్పించాలన్నారు. అసలే నీటి వనరులు తక్కువగా ఉన్న మన జిల్లాలో ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను నీటిలో



వేయడం వలన తీవ్రమైన కాలుష్యం జరుగుతుందన్నారు. ఇది పర్యావరణానికి ఎంతో హాణి కలిగేలా చేస్తుందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయం ప్రకారం మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గరికతో పూజలు చేయాలన్నారు. ప్రజలంతా దీనిని గుర్తించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

# తాగునీటికి ఎక్కడా సమస్య రానివ్వద్దు..
# ముందస్తు ప్రణాళికలు ఉండాలి

అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : రాప్తాడు నియోజకవర్గంలోని 6మండలాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రానివ్వద్దని.. అధికారులకు ఎమ్మెల్యే పరిటాల స- ునీత ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఎల్-నినో సమస్య ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులు, అలాగే ఎక్కడెక్కడ సమస్య ఉందన్నది తెలుసుకున్నారు. ఇప్పటికే తన దృష్టికి వచ్చిన ప్రాంతాల గురించి చర్చించారు. అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి కాలనీ, పాపంపేట, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, పంపనూర్ తండా, ఇంకా రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రాప్తాడు మండలాలలోని గ్రామాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చర్చించారు. బోర్లలో నీటి మట్టం తగ్గినప్పుడు పైపులు అదనంగా దించడం, మోటార్స్ వెంటనే రిపేర్ చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతపురం రూరల్ మండలంలో ప్రస్తుతం జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తిచేస్తే రెండు నెలల్లో నీరు ఇవ్వగలుగుతామన్నారు. అక్కంపల్లి దగ్గర బోర్లను రన్ చేస్తే కక్కలపల్లి, పాపంపేటకు ఇవే నీరు సరఫరా చేయవచ్చున్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ కింద 8 ట్యాంకులు కట్టి వాటి ద్వారా ఎస్కేయూ వరకు నీరు ఇస్తున్నామన్నారు. నరసనాయనకుంట, ఎం.బి.పల్లి, సజ్జల కాలువ ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న నీటి సమస్యను తీర్చినట్టు చెప్పారు. చియ్యేడు ఎస్సీ కాలనీ, అక్కంపల్లి, సుభాష్ కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలన్నారు.



రాప్తాడు మండలం పాలబావి మినహా ఇంకా ఏ గ్రామాల్లోనూ నీటి సమస్య లేదని.. కాకపోతే భూగర్భ జలాలు తగ్గుముఖం పడితే.. రానున్న రోజుల్లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. కావున సర్ఫేస్ వాటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెన్నేకొత్తపల్లి మండలం పల్లెన్నగారిపల్లి, ప్రసన్నాయపేట డిపినింగ్ చేయాల్సి ఉందన్నారు. ఒంటికొండ, హరియాన్ చెరువు, న్యామద్దెల, ప్యాదిండి, సికేపల్లి, పల్లెన్నగారిపల్లిలో నీటి సరఫరా కోసం ట్యాంకర్లు అవసరం ఉంటుందన్నారు. రామగిరి మండలం కొండాపురం, మాదాపురంలో కాస్త నీరు తగ్గిందని.. గంగంపల్లి నుండి సరఫరా చేస్తున్నారన్నారు. సంపుకు కనెక్షన్ ఇవ్వడానికి పైపులు కావాలని, డీప్నింగ్ చేయాలన్నారు. నరసంపల్లి సంపుకు నీరు నింపితే రామగిరి మండలంలోని 12 గ్రామాలు, కనగానపల్లి మండలంలో 22 గ్రామాలకి నీటి సరఫరా చేయవచ్చున్నారు. వీటికి అంచనాలు తయారు చేయవలసిందిగా ఆదేశించారు. ఆత్మకూరు మండలంలోని పంపనూరు తాండాకు సరఫరా చేసే మోటారు కెనాల్ లో ఉందని.. దాని మరమ్మతుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడాలన్నారు. సత్యసాయి నీటి సరఫరా కొనసాగితే ఆత్మకూరులో ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. మ- రోవైపు నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల గురించి కూడా చర్చించారు. పింఛన్ల విషయంలో తహసిల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒంటరి మహిళ సర్టిఫికెట్లు, ఇతర ధృవ పత్రాలకు సంతకాలు ఆలస్యం కాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన అందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు.

# గ్రామీణ రహదారి అభివృద్ధికి రూ.4.23 కోట్ల నిధులు

గుంతకల్లు, సెప్టెంబర్ 12 అనంత సూర్య : గుంతకల్లు నియోజకవర్గంలో ఆలూరు రోడ్డు నుంచి బంటనహాల్ గ్రామం వరకు ఎసఏఎస్సీఐ పథకం కింద రూ.4.23 కోట్లతో చేపట్టనున్న సుమారు 6.5 నుంచి 7 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు సంబంధించి భూమిపూజ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని నిధులు తీసుకురావడంలో చేసిన కృషి అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల



అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తూ రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర్ల అభ్యున్నతే లక్ష్యం..
# చివరి బొట్టు వరకు పోరాటం చేస్తా : దేవళ్ల మురళి

అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య: నగరంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు,రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వడ్డెర్లకు పెద్దపీట వేస్తూ మైనింగ్ రంగంలో కొండ క్వారీలకు జీవో నెంబర్ 234 ద్వారా 33 శాతం అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వడ్డెర్లు చేస్తున్న పోరాటంలో భాగంగా కొండ క్వారీలలో 33 శాతం అవకాశం కల్పించడంతో పాటు రోడ్ మెటల్, నాపు బండలు, గ్రావెల్, క్వార్ట్జ తదితర వాటిలో రాయల్టీపై 50 శాతం మినహాయింపు కల్పించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని వడ్డెర కులబంధువులు వెంటనే సొసైటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వడ్డెర జాతి అభ్యున్నతి కోసం తన చివరి బొట్టు వరకు నిరంతరం కృషి చేస్తానని దేవళ్ల మురళి అన్నారు. పేద వడ్డెర్లకు అండగా నిలిచి, వారి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వడ్డెర్లకు గెజిట్లో గుర్తింపు కల్పించడం నుంచి ప్రస్తుత స్థాయికి తీసుకురావడం వరకు నిరంతరం పోరాడుతున్నానని,



భవిష్యత్తులో వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చే సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి వడ్డెరలను ఏకం చేస్తామని తెలిపారు. త్వరలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఎస్టీ సాధన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. గతంలో తన ఒక్క పిలుపుతో తన వెంట నడిచి తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రతి వడ్డెర బిడ్డకు జీవితాంతం రుణపడి ఉంటానని దేవళ్ల మురళి అన్నారు. తనను గుర్తించి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా, పార్టీ అబ్జర్వర్ ఇన్చార్జిగా అవకాశం కల్పించినందుకు వారికి రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సింగనమల నియోజకవర్గం అధ్యక్షుడు పిట్ల రవీంద్ర, గార్లదిన్నె అధ్యక్షుడు వడ్డే రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉచిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ..

అనంత సూర్య, 12: అనంతపురం హెచ్ఎల్సి కాలనీలోని లోని శ్రీ కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ వలి స్వామి ఆశ్రమంలో ఉచిత మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలనే పూజించి జల కాలుష్యాన్ని నివారించాలని భక్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా 108 మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరిగిందని విజయకుమార్ తెలిపారు భక్తులకు మట్టి



గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగభూషణం పుబ్బరాజు విజయకుమార్ నాగేశ్వరరావు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

## ఘనంగా ఎన్హెచఆర్పిఎఫ్ రాష్ట్ర సదస్సు, జాతీయ సమావేశం



అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : స్థానిక అలెగ్జాండర్ హోటల్లో నిర్వహించిన జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర సదస్సు, జాతీయ సమావేశానికి సీఈఓ, చైర్మన్ తూము రామచంద్ర నాయుడు, జాతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవీలత ముఖ్య అతిథులుగా హాజరై ఎన్హెచఆర్పిఎఫ్ యొక్క విధి విధానాలను, ప్రజల యొక్క హక్కులు వారి విధులు గురించి వివరించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెల మొదటి 15 రోజులు వనం-మనం కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఎన్హెచఆర్పిఎఫ్ ప్రతినిధులు ప్రతి ఒక్కరు 15 నుంచి 20 మొక్కలు నాటుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడైన బిఎస్ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్హెచఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. నూతనంగా ఎన్నికైన వారు నిబద్ధతతో పని చేసి సంస్థకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. సమావేశానికి దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల నుండి అనేకమంది ఎన్హెచఆర్పిఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరు రామిరెడ్డి హాజరై విలువైన సూచనలను సలహాలను అందించారు. జాతీయ అధికార ప్రతినిధి కాంతి జాన్వెస్లీ మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమిటీలు పూర్తి చేసి వారికి అవగాహన తరగతులు నిర్వహిస్తామని, తద్వారా ఎనఆర్పిఎఫ్ ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించి అన్యాయాన్ని ఎదిరించి తమ హక్కుల సాధించుకునే విధంగా చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ సహాయ కార్యదర్శి కంచుమర్తి బాబురావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, కన్వీనర్ జీ.విల్సన్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా ఇంచార్జ్ విజయకుమార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలకు చెందిన ఎన్హెచఆర్పిఎఫ్ ప్రతినిధులు హాజరయ్యారు.

## తల్లీ కొడుకుల మృతి కారకులపై చర్యలు తీసుకోవాలి
### - బీసీవై విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్



అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : ప్రకాశం జిల్లా సింగరాయకొండలో జరిగిన తల్లీ కొడుకుల మృతికి గల కారకులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో మంత్రి నారా లోకేష్ కూడా స్పందించాలని బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరాయకొండలోని శ్రీచైతన్య నవోదయ కోచింగ్ సెంటర్లో పాఠశాల విద్యార్థి సయ్యద్ తౌసిక్ అనుమాన స్పదంగా మృతి చెందారన్నారు. ఈ ఘటనపై న్యాయం కోసం పోరాడుతూ అతని తల్లి మౌలాబీ కూడా మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు రక్షణ లేకుండా ఉందని, తల్లీ కొడుకుల మృతికి కారకులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై ఒక ప్రత్యేకమైన కమిటీ వేసి పర్మిషన్ లేకుండా నడుపుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 22న లోకేశ్ పర్యటన – ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, సెప్టెంబరు 11 అనంత సూర్య : రాప్తాడు నియోజకవర్గంలో ఈ నెల 22న మంత్రి నారా లోకేశ్ పర్యటిస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. అనంతపు రంలోని తన క్యాంపు కార్యాలయంలో పింఛన్ దరఖాస్తులపై పార్టీ శ్రేణులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా లోకేశ్ పర్యటన వివరాలను తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో నిర్మించిన కస్తూర్బా పాఠశాల అదనపు భవనాలను లోకేశ్ ప్రారంభిస్తారని తెలిపారు. రాప్తాడులో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్ర హాలను ఆవిష్కరించి, అక్కడ జరిగే సభలో ప్రసంగిస్తారని వెల్లడించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలకుంట రాము
- 5.03లక్షల రూపాయల చెక్కును సీఎంఆరఎఫ్ ద్వారా అందించిన ఎమ్మెల్యే
- రాము ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే
- పిల్లల్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చదివించేలా చర్యలు తీసుకుంటామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. నగరంలోని 41వ డివిజన్, యువజన కాలనీకి చెందిన ఆలకుంట రాము తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక టిడిపి నాయకులు ఆర్థికంగా అండగా నిలిచేందుకు సీఎంఆరఎఫ్(ుఎ్రీవీ=ఖీ) ద్వారా దరఖాస్తు చేయించారు. ఇంతలో పరిస్థితి విషమించి రాము చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేకంగా చొరవ తీసుకుని సీఎంఆరఎఫ్ చెక్కు వచ్చేలా చేశారు. మొత్తం 5.03లక్షల రూపాయల చెక్కును స్వయంగా రాము ఇంటికి తీసుకెళ్లి.. రాము సతీమణి సంగమ్మకు అందజేశారు. ముందుగా సంగమ్మతో పాటు పిల్లలను పలుకరించారు. రాము మృతి చెందడం చాలా బాధాకరమని.. పార్టీ కోసం బాగా పని చేసేవాడన్నారు. ప్రస్తుతం సీఎంఆరఎఫ్ ద్వారా మీకు కొంత ఆర్థికంగా అండగా ఉండేలా చూశామని.. భవిష్యత్ లో ఏకష్టం వచ్చినా నాతో పాటు పార్టీ ఉంటుందన్నారు. పిల్లల చదువుల గురించి ఆరా తీయగా.. వారు ధర్మవరంలో చదువుతున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి గారి దృష్టికి తీసుకెళ్లి.. ట్రస్ట్ ద్వారా చదివించేలా చూస్తామన్నారు. మీకు ఏ అవసరం ఉన్నా నేను అండగా ఉంటానని.. అధైర్య పడవద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ టిడిపి నాయకులు పెద్ద మారప్ప, వడ్డే భవాని, వడ్డే వెంకటేష్, కదిరప్ప, సీనా, వెంకటరాముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా మట్టి వినాయకున్నే పూజించాలి

- పర్యావరణ పరిరక్షణ కోసం పిలుపునిచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి మట్టి విగ్రహం, పూలమొక్కను అందజేసిన ఎమ్మెల్యే
- 4వేల విగ్రహాలు పంపిణీ చేసిన శివను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ ఆధ్వర్యంలో 25వ డివిజన్ హౌసింగ్ బోర్డ్‌లో ఆయన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. 25వ డివిజన్‌లో ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికి వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను, ఒక పండ్ల మొక్కను అందజేశారు. పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పిస్తూ.. మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. వినాయక చవితి అంటే ప్రతి ఇంట, ప్రతి వాడలో ఘనంగా జరిగే భారీ పండుగ అన్నారు. అయితే చాలా మంది ఆకర్షణీయంగా ఉంటాయని, ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను పూజించడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేస్తే అక్కడ నీరు మొత్తం కలుషితమవుతుందన్నారు. ఇది పర్యావరణానికి హాని కల్గిస్తుందన్నారు. అందుకే మన సాంప్రదాయం ప్రకారం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలన్నారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ 4 వేల మట్టి విగ్రహాలు పంచి పర్యావరణానికి మేలు చేస్తున్నారన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాజారావు, చేపల హరి, సాకే లక్ష్మీనరసింహ, తొండపునాటి రమేష్, అర్షదుల్లా, బాలాంజనేయులు, సున్నం శ్రీనివాసులు, రంగా, మణిరవి, పుల్లన్న, నల్లాని మనోహర్, గోపాల్, జాఫర్, హరీష్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి



అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి అని, అలాంటి వ్యక్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై ఆరోపణలు చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న నీరు ప్రగతి పార్క్ సర్కిల్ వద్ద 80 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసామన్నారు. 250 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడా కూడా రోడ్లు డ్రైనేజీలు వేసిన పాపాన పోలేదన్నారు. కనీసం కాలువలు శుభ్రం చేసిన పరిస్థితి కూడా లేదన్నారు. కేవలం ఏదో చేస-త్తున్నామని చెప్పి మభ్యపెట్టి దొంగ బిల్లులు చేసుకున్నారని విమర్శలు చేశారు. ఒక్క శ్రీనగర్ కాలనీలోనే రెండు కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మరో 80 లక్షలు రూపాయలతో నేడు సిసి రోడ్డుకు భూమి పూజ చేసామన్నారు. శ్రీనగర్ కాలనీ రూపురేఖలు మారుస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రోడ్లన్నీ నిర్మించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరో 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కేవలం ఈ రెండేళ్లలోనే 600 కోట్ల రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేటాయించారన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. 16,347 పోస్టులను 150 రోజుల్లోనే భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ జరిగితే వైసిపి నాయకులు అందులో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినప్పటికీ వైసీపీ నాయకులు రాలేదన్నారు. పొద్దున లేచినప్పటి నుంచి డీఎస్సీ మీద ఆరోపణలు చేస్తూ బురదచల్లుతున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు బుగ్గయ్య చౌదరి, కోనంకి గంగారం, సరిపుటి రమణ, సంగా తేజస్విని, రాజారావు, గోళ్ళ సుధాకర్ నాయుడు, సాకే లక్ష్మీనరసింహ,అపొట్లూరి కేశవ నాయుడు, కృష్ణకుమార్, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, గోపాల్ గౌడ్, శ్రీవర్ధన్, మల్లెల దుర్గేష్, గోనుగుంట్ల అమర్నాథ్, పాటిల్ మధు కుమార్, ముకేష్, దాడి రమేష్, బండి కాశి, కదిరప్ప, రమాదేవి, సుజాతమ్మ, అయేషా నేహా, దాసరి చంద్రకళ, ప్రశాంతి, అలివేలమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీటీఎఫ్ 1938 అనంతపురం జిల్లా అనుబంధ కమిటీల ఎన్నిక




అనంతపురం, సెప్టెంబర్ 12 అనంత సూర్య : అనంతపురం జిల్లా ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు జి.రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఏపీటీఎఫ్ 1938 జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అనుబంధ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సబ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా పి.జగదీష్ (బ్రహ్మసముద్రం), అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఎస్. గురుమూర్తి (కంబదూరు), సభ్యులుగా డి.బాబా ఫక్రుద్దీన్ (గుంతకల్లు), డి.పాండురంగ వరప్రసాద్ (ఉరవకొండ), ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా జి.రవికుమార్ (కుందుర్పి), సభ్యులుగా సి.మనోహర్ (కనేకల్), క్రమశిక్షణ కమిటీ కన్వీనర్‌గా తిరుపాల్ నాయక్ (అనంతపురం అర్బన్), మహిళా కమిటీ కన్వీనర్‌గా బండి సరిత (బెలుగుప్ప), సభ్యులుగా డి.శ్రీదేవి (కళ్యాణదుర్గం), కె.నాగజ్యోతి (నార్పల) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.రవీంద్ర, ప్రధాన కార్యదర్శి బి. హనుమప్ప మాట్లాడుతూ.. సంఘ నిర్మాణం బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణ, భవన నిధి సేకరణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డీఏ బకాయిలు సహా పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా నాయకత్వం ద్వారా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.అశోక్ నాయక్, ఐఫియా శాశ్వత సభ్యులు సత్యప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు సాకే భాస్కర్, అదనపు కార్యదర్శి పోతులయ్య, సీనియర్ నాయకులు బుటారి వెంకటేశులు, బి.సి.తిన్నప్ప, చెన్నకేశవులు, జిల్లా ఉపాధ్యక్షులు వజీర్ బాషా, నాగరాజు, జిల్లా కార్యదర్శి హనుమంతు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సబ్ కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల పరిసరాలలో

## పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ జగదీష్




అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 12 అనంత సూర్య : విద్యాసంస్థల పరిసరాల్లో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఐపిఎస్ ఆదేశాల మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య టెక్నో స్కూల్, నెహ్రూ స్కూల్, శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్ సమీపంలో ఈగల్ టీమ్, రెండో పట్టణ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు,పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలోని 7 బడ్డీ, కిరాణా దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో (సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం) నిబంధనలను ఉల్లంఘించి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న 5 దుకాణాల యజమానులకు రూ.2,200 జరిమానా విధించారు. విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం చట్టరీత్యా నేరమని దుకాణదారులకు స్పష్టం చేశారు. మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు,ఈ తనిఖీల్లో రెండో పట్టణ సిఐ పుల్లయ్య, ఎస్ఐ రామకృష్ణ, ఈగల్ సెల్ ఎస్ఐ.హనుమంతు,సిబ్బంది అమర్నాథ్ రెడ్డి, నల్లపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం... సెలవు మాత్రమే కాదు, సాధించిన హక్కు



వారమంతా ఎదురు చూసే రోజు ఏదైనా ఉందంటే అది ఆదివారమే. ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, స్నేహితులను కలవడం, చిన్న చిన్న విహారయాత్రలు, పిల్లలతో సరదాగా గడపడం, పుస్తకాలు చదవడం, ఇష్టమైన పనులు చేసుకోవడం... ఇలా ప్రతి ఒక్కరికీ ఆదివారం అంటే ప్రత్యేకమైన అనుభూతి. కానీ మనం ఎంతో సహజంగా భావించే ఈ ఒక్క రోజు సెలవు వెనుక ఒక సుదీర్ఘ చరిత్ర, వేలాది మంది కార్మికుల పోరాటం, సామాజిక మార్పు కోసం సాగిన ఉద్యమం దాగి ఉందని చాలా మందికి తెలియదు. నేడు మనం ఆస్వాదిస్తున్న ఆదివారం విశ్రాంతి ఒకప్పుడు సాధారణ ప్రజలకు అందని అవకాశంగా ఉండేది. ఆదివారం సెలవు సంప్రదాయానికి ప్రపంచ చరిత్రలో చాలా పాత మూలాలు ఉన్నాయి. క్రీస్తుశకం 321లో రోమన్ చక్రవర్తి కాన్స్టాంటైన్ ఆదివారాన్ని అధికారిక విశ్రాంతి దినంగా ప్రకటించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. క్రైస్తవ మత సంప్రదాయంలో ఆదివారం ప్రార్థనలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేకమైన రోజుగా భావించబడేది. కాలక్రమేణా ఈ విధానం యూరప్ దేశాలకు విస్తరించింది. తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యం తన పాలనతో పాటు ఈ వారాంత విశ్రాంతి విధానాన్ని కూడా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు తీసుకెళ్లింది. భారత్‌లోనూ ఆదివారం సెలవు భావన బ్రిటిష్ పాలనా వ్యవస్థ ద్వారానే ప్రవేశించింది. అయితే బ్రిటిష్‌లు భారత్‌కు వచ్చిన వెంటనే అందరికీ ఆదివారం సెలవు లభించలేదు. ప్రభుత్వ అధికారులు, బ్రిటిష్ ఉద్యోగులకు మాత్రమే విశ్రాంతి ఉండేది. మరోవైపు భారతీయ కార్మికులు వారానికి ఏడు రోజులూ నిరంతరంగా పనిచేయాల్సి వచ్చేది. ముఖ్యంగా బొంబాయి వస్త్ర మిల్లుల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేది. రోజుకు 12 గంటలకు పైగా పని, సరైన భోజన విరామం లేకపోవడం, విశ్రాంతి లేకపోవడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. కుటుంబంతో గడిపే సమయం కూడా వారికి దొరకేది కాదు. కార్మికులను యంత్రాల్లా పని చేయించేవారు. ఈ పరిస్థితి క్రమంగా అసంతృప్తికి దారితీసింది. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పిన వ్యక్తి నారాయణ్ మేఘాజీ లోఖండే. భారత కార్మిక ఉద్యమ పితామహుడిగా గుర్తింపు పొందిన ఆయన, కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు. 1880లలో బాంబే మిల్ హ్యాండ్స్ అసోసియేషన్‌ను స్థాపించి వారానికి ఒకరోజు సెలవు, పని గంటల నియంత్రణ, భోజన విరామం, సమయానికి వేతనాల చెల్లింపు వంటి డిమాండ్లతో బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. వేలాది మంది కార్మికులను ఏకం చేసి సమావేశాలు, వినతిపత్రాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల విశ్రాంతి కూడా ఒక హక్కేనని ఆయన బలంగా వాదించారు. దాదాపు ఏడు సంవత్సరాల పాటు సాగిన ఈ పోరాటం చివరకు ఫలించింది. 1890 జూన్ 10న భారత కార్మికులకు ఆదివారాన్ని అధికారిక వారాంత సెలవుగా ప్రకటించారు. ఇది కేవలం ఒకరోజు సెలవు మాత్రమే కాదు, భారత కార్మిక ఉద్యమ చరిత్రలో గొప్ప విజయంగా నిలిచింది. అనంతరం ఈ విధానం క్రమంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోస్టాఫీసులు, రైల్వేలు, ప్రైవేట్ సంస్థలకు విస్తరించింది. నేడు మనం సహజంగా అనుభవిస్తున్న వారాంత విశ్రాంతి వెనుక ఉన్న అసలు కథ ఇదే. ఆదివారాన్నే సెలవు దినంగా ఎంచుకోవడానికి కూడా కొన్ని కారణాలు ఉన్నాయి. బ్రిటిష్ పాలకులకు అది ప్రార్థన దినం. అదే సమయంలో భారతీయ సంప్రదాయంలో కూడా ఆదివారం సూర్యభగవానునికి అంకితమైన పవిత్ర దినంగా పరిగణించబడేది. రెండు వర్గాల ఆచారాలకు అనుగుణంగా ఉండటంతో ఆదివారాన్నే వారాంత విశ్రాంతి దినంగా నిర్ణయించారు. తర్వాత ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా పాటించే సెలవు విధానంగా మారింది. కాలం మారిన కొద్దీ ఆదివారం అర్థం కూడా మారింది. ఒకప్పుడు అది కేవలం శ్రమ నుంచి ఉపశమనం కోసం దక్కిన రోజు. ఇప్పుడు అది కుటుంబ అనుబంధాలకు, వ్యక్తిగత అభిరుచులకు, సామాజిక సంబంధాలకు వేదికగా మారింది. పిల్లలకు ఆటల రోజు, విద్యార్థులకు ఉపశమన దినం, ఉద్యోగులకు విశ్రాంతి సమయం, పెద్దలకు కుటుంబంతో గడిపే అవకాశం. జీవితంలో కోల్పోతున్న అనుబంధాలను తిరిగి గుర్తు చేసే రోజు కూడా ఆదివారమే. అందుకే చాలామందికి ఆదివారం ఒక భావోద్వేగం, ఒక అనుభూతి.అయితే ఆధునిక కాలంలో ఆదివారం అసలు ఉద్దేశం కొంతమేర మారిపోతోంది. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, వర్క్ ఫ్రం హోమ్ విధానాల కారణంగా చాలామంది సెలవు రోజున కూడా పని ఒత్తిడిలోనే ఉంటున్నారు. విశ్రాంతి కోసం ఉద్దేశించిన రోజును కూడా ఇమెయిల్స్, మీటింగ్‌లు, ఆన్‌లైన్ పనులు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందాల్సిన అవకాశం తగ్గిపోతోంది. అందువల్ల ఆదివారం విలువను మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.వాస్తవానికి ఆదివారం మనిషి జీవితానికి సమతుల్యతను అందించే రోజు. పని ఎంత ముఖ్యమో విశ్రాంతి కూడా అంతే ముఖ్యమని గుర్తు చేసే రోజు. కుటుంబం కోసం, మనసు కోసం, ఆరోగ్యం కోసం, ఆనందం కోసం కేటాయించిన రోజు. మనం చేసే పనికి అర్థం రావాలంటే జీవితం కూడా ఉండాలని, జీవితం ఉండాలంటే విశ్రాంతి అవసరమని చెప్పే రోజు.అందుకే ఆదివారం కేవలం క్యాలెండర్‌లోని ఒక రోజు కాదు. అది కార్మికుల పోరాటానికి గుర్తు. మనిషి గౌరవానికి ప్రతీక. కుటుంబ సంతోషాలకు చిరునామా. వారమంతా అలసిపోయిన మనసుకు కొత్త శక్తిని ఇచ్చే పునరుజ్జీవన దినం. నేడు ఆదివారం హాయిగా గడుపుతున్న ప్రతి ఒక్కరూ, ఆ ఒక్కరోజు విశ్రాంతి కోసం పోరాడిన వేలాది మంది కార్మికులను, నారాయణ్ మేఘాజీ లోఖండే వంటి ఉద్యమకారులను ఒకసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మనం ఆనందంగా గడిపే ఈ ఆదివారం... ఎవరో సాధించి పెట్టిన హక్కు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405